
ప్రజాశక్తి
మంగళవారం 19 ఆగస్టు 2025
5
పార్వతీపురం మన్యం



సబ్ జైలును సందర్శించిన జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి

పాలకొండ : స్థానిక సబ్ జైలును జిల్లా న్యాయ సేవాధికారి సంస్థ కార్యదర్శి కె.హరిబాబు సోమవారం ఆకస్మిక సందర్శించారు. జైల్లోని ముద్దాయిలతో మాట్లాడారు. వీరి ఆరోగ్యం పరీక్షలు చేయడానికి వైద్యులు వస్తున్నదీ, రాలేనిదీ అడిగి తెలుసుకున్నారు. అవసరమైతే మందులు ఇవ్వాలన్నారు. మెనూ ప్రకారం ఆరోగ్యవంతం, రుచి కరమైన ఆహారాన్ని ఇస్తున్నారా అని అడిగి తెలుసుకున్నారు దీనిపై ముద్దాయిలు మాట్లాడుతూ జైల్లో ఆహారం, వైద్యం జైలు అధికారులు అన్ని బాగానే చూస్తున్నారని తెలిపారు. అనంతరం జైలు పరిసర ప్రాంతాలను పరిశీలించారు. జైల్లో పరిసరాల పరిశుభ్రత పాటించాలన్నారు. ఖైదీలకు తాగడానికి వేడి నీళ్ల ఇవ్వాలని జైలు సూపరింటెండెంట్ బి.జోగులుకు సూచించారు. కార్యక్రమంలో హెడ్ వార్డెన్ జి.రమణయ్య, బి.విజయ్ కుమార్, జిపిటి నాయుడు, నరసింహులు, హరికృష్ణ తదితరులు ఉన్నారు.



తోటపల్లి బ్యారేజ్ నుంచి బయటకు విడుదల చేసిన నీరు

నిండుకుండలా జలాశయాలు

- ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలు
- ప్రాజెక్టులు, చెరువుల్లో భారీగా చేరిన నీరు
- అన్నదాతల్లో ఆందోళన
- అప్రమత్తంగా ఉండాలంటున్న అధికారులు



జంఝావతి రబ్బరు డ్యాం నుంచి దిగువకు పోతున్న వరద నీరు

ప్రజాశక్తి - పార్వతీపురం

బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో జిల్లాలో విస్తారంగా వర్షాలు పడుతున్నాయి. గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు మొక్కజొన్న, పత్తి వంటి పంటలు దెబ్బతినే అవకాశాలు ఉన్నాయి. ఎడతెరిపి లేకుండా వర్షాలు కురుస్తుండడంతో అన్నదాతల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. ఇప్పుడిప్పుడే వరినాట్లు వేయడంతో తాజా వర్షాల వల్ల ముంపునకు గురవుతాయేమోనని రైతులు దిగులు చెందుతున్నారు. జిల్లాలో గల ప్రధాన జలాశయాలైన తోటపల్లి, జంఝావతి, విఆర్ఎస్ నిండుకుండల్లా దర్శనమిస్తున్నాయి. తోటపల్లి, జంఝావతి రిజర్వాయర్ల నుంచి కిందికి నీటిని విడుదల చేశారు. మంగళ, బుధవారాల్లో కూడా భారీ వర్షాలు పడతాయని వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసింది. జిల్లాలో పత్తి, మొక్కజొన్న పంటలు అధిక విస్తీర్ణంలో సాగు చేస్తున్నారు. రోజుల తరబడి వర్షాలు కురిస్తే ఆ పంటలు కుళ్ళిపోయే ప్రమాదం వుంది.

జంఝావతి, నాగావళి నదులలో పెరిగిన నీటి ప్రవాహం

కొమరాడ: ఆంధ్ర, ఒరిస్సా సరిహద్దు ప్రాంతంలో భారీ వర్షాలు కురవడంతో నదులలో నీటి ప్రవాహం పెరిగి స్వల్ప ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. మండలంలోని నాగావళి, జంఝావతి నదుల్లో భారీగా వరద నీరు చేరింది. వరద నీరు పోటెత్తడంతో రెండు నదుల్లో కూడా నీటి ప్రవాహం భారీగా పెరిగింది. దీంతో నదీ పరివాహక ప్రాంతాల ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. అయితే ఈ వర్షాలు రైతులకు బాగా ఊరటనిచ్చాయి. వర్షాలు లేక ఎండిపోతున్న వరినారు, వరి మడులకు ఈ వర్షాలతో ఊపిరొచ్చింది.

ప్రాజెక్టుల నీటి మట్టాలు

రిజర్వాయరు	పూర్తి సామర్థ్యం	ప్రస్తుత నీటిమట్టం
తోటపల్లి	105. మీటర్లు	104.20మీటర్లు
జంఝావతిరబ్బరు డ్యాం	-----	22.80మీటర్లు
పెద్దగెడ్డ	213.8 మీటర్లు	211.98 మీటర్లు
వట్టిగెడ్డ	121.62 మీటర్లు	117.07మీటర్లు
విఆర్ఎస్	161మీటర్లు	160.58
తాటిపూడి	297 అడుగులు	290.80 అడుగులు
మడ్డువలస	65 మీటర్లు	64.18మీటర్లు
ఆంధ్ర	146మీటర్లు	140.75 మీటర్లు

అప్రమత్తంగా ఉండాలి

నదీ పరివాహ ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎంపిడిఒ రమేష్, తహశీల్దార్ సిహెచ్ సత్యనారాయణ అన్నారు. గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాల నేపథ్యంలో నదీ పరివాహక ప్రాంతాల ప్రజలను అప్రమత్తంగా ఉంచాలని ఆదేశించారు.

కురుపాం : బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా గత రెండు రోజులుగా కురుపాం మండల కేంద్రంతో పాటు పరిసర, గిరిశిఖర గ్రామాల్లో వర్షాలు కురుస్తున్నప్పటికీ సోమవారం మధ్యాహ్నం 12 గంటల నుంచి సుమారు రెండు గంటలపాటు పెద్ద వర్షం కురిసింది. అనంతరం ఏకధాటిగా చిరుజల్లులు పడుతుండడంతో జనజీవనం పూర్తిగా స్తంభించిపోయింది. దీంతో రోజువారి కూలీలు కూలికి వెళ్లలేక, ఆటో కార్మికులు ఆటోలు నడప లేక ఎక్కడికక్కడ నిలిచిపోయాయి.

సీతంపేట : సీతంపేటలో గత మూడు రోజులుగా తుపాను కారణంగా వర్షాలు విస్తరంగా కురుస్తున్నాయి. దీంతో ఏజెన్సీలో ఉన్న గెడ్డలు వాగులు పొంగిపొర్లుతున్నాయి. కొన్ని ప్రాంతాల్లో ఇప్పటికే సాగునీరు లేక వరినాట్లు వేయలేదు. సాగునీరు లేక వర్షుడు కోసం ఎదురు చూసన్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు వర్ష శాతం కూడా తక్కువే నమోదయినప్పటికీ వర్షపు నీరు నిర్బంధించి పొలాలకు పంపిస్తున్నారు. దీంతో వరినాట్లు వేసే అవకాశం ఉందని రైతులు చెబుతున్నారు. మరో పక్క మెట్టు ప్రాంతాలకు, కొండ ప్రాంతాల్లో అటవీ ఉత్పత్తులకు కూడా ఈ వర్షాలు అనుకూలం అని చెప్పవచ్చు. ఆది, సోమవారం సీతంపేటలో జరిగిన సంతకు తీసుకువచ్చిన అటవీ ఉత్పత్తులకు ఈ వర్షాల వల్ల కొంత మార్కెట్ ధర దెబ్బ తీసింది. వర్షాల కారణంగా ఎంతోకొంతకు విక్రయించాల్సిన పరిస్థితి ఉంది. అలాగే లక్కాయి గూడ చెందిన సవర సింగన్న ఇంటి గోడ కూలిపోయింది. అయితే ఎటువంటి ప్రమాదం జరగలేదని ఆర్ఐ వి.విజయ గణేష్‌బాబు తెలిపారు. సంఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. బాధిత కుటుంబానికి బియ్యం, కందిపప్పు అందజేశారు.

పాలకొండ : గత రెండు రోజులుగా పాలకొండలో వర్షాలు కురుస్తున్నాయి. సోమవారం కూడా ఎడతెరిపి లేకుండా వర్షం కురవడంతో ప్రజలు కొంత సౌకర్యానికి గురయ్యారు లోతట్టు ప్రాంతాలన్నీ జలమయమయ్యాయి పట్టణంలోని గారం కాలనీ, గాయత్రి నగర్ తదితర ప్రాంతాలు పూర్తిగా నీటినిలో మునిగాయి.దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు



వీరఘట్టం : నడుకూరు పాఠశాలలో చేరిన వర్షం నీరు

పాఠశాలలోకి చేరిన వర్షం నీరు

వీరఘట్టం : మండలంలోని కురుస్తున్న వర్షాలకు నడుకూరు ప్రాథమిక ఉన్నత పాఠశాలలోకి వర్షం నీరు చేరింది. పాఠశాలకు సమీపంలో ఉన్న బిసి కాలనీ వీధికి కాలువ లేకపోవడంతో వర్షం నీరంతా పాఠశాలలో చేరి పోతుంది. ఈ సమస్య గత పదేళ్లుగా ఉంది. సర్పంచి, పంచాయతీ కార్యదర్శి జాయింట్ కలెక్టర్‌కు కూడా ఈ విషయాన్ని తెలిపినా ఎలాంటి ఫలితం లేదని బిసి కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారి స్పందించి బీసీ కాలనీ డ్రైనేజ్ కాలనీ నిర్మించేందుకు తగు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. అలాగే మండలంలోని కడకల్లా, చిట్టిపూడివలస, కిమ్మి, పివిఆర్‌పురం, బిటివాడ, పిఎన్‌వాడ నదీ తీర ప్రాంతాలను సోమవారం రెవెన్యూ అధికారులు పరిశీలించారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి : కలెక్టర్

జిల్లాలో మంగళవారం భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని,కావున ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ కోరారు. ప్రజలకు ఎప్పటికప్పుడు సమాచారాన్ని చేరవేస్తూ అప్రమత్తం చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో జిల్లా అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం పడే సమయంలో చెట్లు, టవర్స్, పోల్స్, పొలాలు, బహిరంగ ప్రదేశాల్లో, శిథిలావస్థలో ఉన్న భవనాలు, గృహాల్లో ఎవరూ ఉండరాదని విజ్ఞప్తి చేశారు. ప్రజలు సురక్షితమైన భవనాల్లో ఆశ్రయం పొందాలని, వర్షాల వేళ అందరూ తగిన జాగ్రత్తలు తప్పనిసరిగా తీసుకోవాలని సూచించారు. ముఖ్యంగా రెవెన్యూ, పంచాయతీ, విద్యుత్, తాగునీటి సరఫరా - పారిశుధ్యం, వైద్య ఆరోగ్యం తదితర శాఖలు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని, ప్రధాన కేంద్రం విడిచి వెళ్ళారాదని కలెక్టర్ స్పష్టం చేశారు. సమావేశంలో సబ్ కలెక్టర్ ఆర్.వైశాలి, రెవిన్యూ డివిజనల్ అధికారి కె.హేమలత, ప్రత్యేక ఉప కలెక్టర్ పి.ధర్మచంద్రారెడ్డి, డిఆర్డిఎ పీడీ ఎం.సుధారాణి, ఇతర జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

అర్జీలన్నీ పరిష్కారం కావాలి : కలెక్టర్

ప్రజాశక్తి - పార్వతీపురం

ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)లో వచ్చిన అర్జీలన్నీ పరిష్కారం కావాలని జిల్లా కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ అధికారులకు తేల్చిచెప్పారు. సోమవారం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో పీజీఆర్ఎస్ కార్యక్రమం జిల్లా కలెక్టర్ అధ్యక్షతన జరిగింది. సబ్ కలెక్టర్ ఆర్.వైశాలి, డిఆర్ఒ కె.హేమలత, ప్రత్యేక ఉప కలెక్టర్ పి.ధర్మచంద్రారెడ్డి, డిఆర్డిఎ పీడీ ఎం.సుధారాణి ఈ కార్యక్రమంలో భాగస్వామ్యమై అర్జీదారుల నుంచి వినతులను స్వీకరించారు. జిల్లా నలుమూలల నుంచి అర్జీదారులు వినతులను కలెక్టర్, ఇతర అధికారులకు అందించి తమ సమస్యలను పరిష్కరించాలని కోరారు. అనంతరం కలెక్టర్ అధికారులతో మాట్లాడుతూ పీజీఆర్ఎస్ లో వచ్చిన అర్జీలన్నీ పరిష్కారం చేయాలని, ఎక్కడా పెండింగ్ లేకుండా చూడాలని ఆదేశించారు. అర్జీల పరిష్కారంలో నాణ్యత ఉండాలని, అర్జీదారులు సంతృప్తి చెందాలని స్పష్టం చేశారు. ఫిర్యాదుదారుల నుంచి మొత్తం 65 అర్జీలను స్వీకరించారు. కార్యక్రమంలో అన్నిశాఖల జిల్లా ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

వినికిడి యంత్రాన్ని పంపిణీ

జిల్లా ప్రజల సమస్యలను తెలుసుకొని పరిష్కరించేందుకు ఏర్పాటు చేసిన పిజిఆర్ఎస్ కార్యక్రమం ద్వారా ఎంతో మంది లబ్ధిపొందుతున్నారు. కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ అధ్యక్షతన పిజిఆర్ఎస్ కార్యక్రమం సోమవారం జరిగింది.



ఫిర్యాదులను పరిశీలిస్తున్న కలెక్టర్ శ్యామ్ ప్రసాద్

కార్యక్రమంలో వీరఘట్టం మండలం బొడ్లపాడు గ్రామానికి చెందిన రాజాన రామయ్య తనకు వినికిడి సమస్య ఉందని, కావున వినికిడి యంత్రాన్ని మంజూరు చేయాలని కలెక్టర్‌కు వినతి పత్రాన్ని అందించారు. కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ తక్షణమే స్పందిస్తూ వినికిడి యంత్రాన్ని పంపిణీ చేశారు. ప్రజా సమస్యలు తెలుసుకొని పరిష్కరించడమే పిజిఆర్ఎస్ లక్ష్యమని కలెక్టర్ ఈ సందర్భంగా పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా వికలాంగుల సంక్షేమ శాఖ అధికార ప్రతినిధి రమణ, పాల్గొన్నారు.

ఐటిడిఎలో ఫిర్యాదులు స్వీకరణ

సీతంపేట : గిరిజన సమస్యలు పరిష్కరించాలని పలువురు గిరిజనులు ఐటిడిఎలో పిజిఆర్ఎస్‌లో విన్నవించారు. స్థానిక ఐటిడిఎలో సోమవారం పిజిఆర్ఎస్ ఎపిఒ జి.చిన్నబాబు ఆధ్వర్యంలో నిర్వహించారు. కొత్తకోట చెందిన చిరంజీవి కొండచీపుర్లుకు అమ్ముకొనేందుకు అనుమతి ఇవ్వాలని కోరారు. దిగువ ముల్లెలు గూడకు చెందిన సంధ్య చెవిటి మిషన్ కొనుక్కొనేందుకు ఆర్థిక సహాయం ఇప్పించాలని కోరారు. పాలిష్‌కోటకు చెందిన ఓయిక భవాని సదరం సర్టిఫికెట్ ఇప్పించాలని కోరారు. అడ్డంగికి చెందిన హరిబాబు తల్లికి వందనం ఇప్పించాలని కోరారు. శోభనాపురానికి చెందిన మల్లేశ్వరరావు, సింహాచలం నిలిపివేసిన పింఛన్లు ఇప్పించాలని కోరారు. లాడకు చెందిన సుక్కయ్య పింఛను ఇప్పించాలని విన్నవించారు. కార్యక్రమంలో డిడి అన్నదొర డిప్యూటీ డిఇఒ రామ్మోహన్‌రావు, ఇఇ కుమార్, పిహెచ్ఒ గణేష్ , ఎంపిడిఒ కె.సత్యం, ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇ సత్యం, స్పోర్ట్స్ ఇంచార్జ్ జాకబ్ దయానంద్ తదితరులు పాల్గొన్నారు.



మహాసభలో మాట్లాడుతున్న యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధనలక్ష్మి ; హాజరైన ఆశాలు, కమ్యూనిటీ హెల్త్ వర్కర్లు

పోరాటాలతోనే సమస్యలు పరిష్కారం

ఎపి ఆశా, కమ్యూనిటీ హెల్త్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ధనలక్ష్మి

ప్రజాశక్తి - పార్వతీపురం

రాష్ట్రంలో ఆశా, కమ్యూనిటీ హెల్త్ వర్కర్ల సమస్యల పరిష్కారానికి వారు చేసిన పోరాటాలే కారణమని యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ధనలక్ష్మి చెప్పారు. సిఐటియు అనుబంధ జిల్లా 4వ మహాసభలు స్థానిక ఎన్జీ హోమ్‌లో సోమవారం జరిగాయి. ఈ సందర్భంగా యూనియన్ జెండాను ధనలక్ష్మి ఆవిష్కరణ చేశారు. అనంతరం యూనియన్ నాయకులు కె.గౌరీ, ఎ.నిర్మల, పి.అబ్దుల్లా అధ్యక్షతన జరిగిన మహాసభలో సిఐటియు జిల్లా అధ్యక్షులు దావాల రమణారావు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మిక వ్యతిరేక విధానాలు అవలంభిస్తున్నాయని చెప్పారు. పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను రద్దు చేస్తూ వచ్చాయని, వీటివల్ల కార్మిక వర్గానికి తీవ్ర అన్యాయం జరుగుతుందని అన్నారు. అనంతరం ధనలక్ష్మి మాట్లాడుతూ ఆశా వర్కర్ల యూనియన్ ఆధ్వర్యాన పెద్ద ఎత్తున పోరాడి గ్రాట్యూటీ, మెటర్నటీ లీవు సాధించుకున్నారని చెప్పారు. పోరాటాలతో 180 రోజుల వేతనంతో కూడిన ప్రసూతి సెలవులు, రిటైర్మెంట్ వయసు 62 ఏళ్లకు పెంపు, ఏడాదికి రూ. 5 వేలు చొప్పున గరిష్టంగా రూ.లక్షా 50వేలు గ్రాట్యూటీ పెంచుతూ రాష్ట్ర ప్రభుత్వం జిఒ 94ను విడుదల చేసిందని తెలిపారు. ఇది మంచి పరిణామమన్నారు. ఆశా వర్కర్ల యూనియన్ పోరాట స్ఫూర్తితో రాబోయే రోజుల్లో కమ్యూనిటీహెల్త్ వర్కర్ల సమస్యల పరిష్కారానికి అవసరమైతే సమ్మె చేయడానికి సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. సమస్యల పరిష్కారం కోసం జిల్లా మంత్రి ఇంటిని ముట్టడిస్తామని ఆమె హెచ్చరించారు. ఇప్పటికే ఆశా, కమ్యూనిటీ హెల్త్ వర్కర్లతో చేయించకూడని పనులు చేయిస్తున్నారని చెప్పారు. ఆశా వర్కర్ల మాదిరిగానే కమ్యూనిటీ హెల్త్ వర్కర్ల సమస్యలు పరిష్కరించాలన్నారు. కనీస వేతనాలు పెంచాలని, కమ్యూనిటీ హెల్త్ వర్కర్లను ఆశా వర్కర్లుగా గుర్తించాలని డిమాండ్ చేశారు. ఈ మహాసభలో ఎపి అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ రాష్ట్ర నాయకులు ఎం.ఉమామహేశ్వరి, జిల్లా కార్యదర్శి గంట జ్యోతి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కె.గంగ నాయుడు సౌహార్ద సందేశం ఇచ్చారు.

ఎపి ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా నూతన కమిటీ ఎన్నిక

మహాసభల అనంతరం యూనియన్ నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా కె.గౌరి, ప్రధాన కార్యదర్శిగా శివాని, కోశాధికారి బృందా, వి.ఇందిర, మిగతా పదిమంది ఆఫీస్ బేరర్స్, 25 మంది జిల్లా కమిటీ సభ్యులను ఏకగ్రీవంగా మహాసభ ఎన్నుకుంది. కార్యక్రమంలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి యమ్మల మన్మధరావు, ఉపాధ్యక్షులు రెడ్డి వేణు, ఆర్.రాము, కార్యదర్శులు ఎన్‌వై నాయుడు, బివి రమణ, కోశాధికారి గొర్లి వెంకటరమణ, సూరిబాబు, తదితరులు పాల్గొన్నారు.

వికలాంగుల పింఛన్లు పునరుద్ధరించాలి

ప్రజాశక్తి - పార్వతీపురం

రద్దు చేసిన వికలాంగుల పింఛన్లను వెంటనే పునరుద్ధరించాలని కోరుతూ సిపిఎం ఆధ్వర్యాన సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట వికలాంగులు ధర్నా నిర్వహించారు. ఈ ధర్నానుద్దేశించి సిపిఎం జిల్లా కార్యదర్శి కొల్లి గంగునాయుడు మాట్లాడుతూ ఎన్నికలకు ముందు ఆర్భాటంగా హామీల వర్షం కురిపించిన కూటమి నేతలు ఇప్పుడు పింఛన్లు, ఇతర సంక్షేమ పథకాలను కుదించేందుకు కుట్రలు చేస్తుండడం అత్యంత దుర్మార్గమైన చర్యని విమర్శించారు. తల్లికి వందనం, రైతు భరోసా, వికలాంగుల పెన్షన్లు వంటి పథకాల్లో అనర్హుల పేరిట నిజమైన అర్హత కలిగి, అనేక ఏళ్లుగా లబ్ధిపొందుతున్న వారిని కూడా సంక్షేమ పథకాలకు దూరం చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. రాష్ట్ర ప్రభుత్వం అర్హత కలిగిన వికలాంగుల పెన్షన్లను రద్దు చేసే ఆలోచన మానుకోకపోతే సిపిఎం ఆధ్వర్యాన పెద్ద ఎత్తున లబ్ధిదారులతో ఆందోళన చేపడతామని హెచ్చరించారు. అనేక ఏళ్లుగా పెన్షన్లు పొందుతున్న లబ్ధిదారులకు ఇప్పుడు కొత్త కొత్త నిబంధనలు పెట్టి పాత వికలాంగుల సర్టిఫికెట్లను రద్దు చేసి వికలాంగుల శాతం తక్కువ ఉందనే సాకుతో ఈ రకంగా పెన్షన్ తొలగించడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. నకిలీ సర్టిఫికెట్లతో పెన్షన్లు పొందుతున్న వారిపై చర్యలు తీసుకోవడానికి అభ్యంతరం లేదని, కానీ నకిలీల పేరుతో అసలైన లబ్ధిదారులకు అన్యాయం చేస్తే మాత్రం సహించేది లేదని హెచ్చరించారు. ఇప్పటికైనా ప్రభుత్వం ఈ పింఛన్ల తొలగింపు నిబంధనలపై స్పష్టమైన ఆదేశాలివ్వాలని కోరారు. అనంతరం జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నిజమైన లబ్ధిదారులకు ఎలాంటి అన్యాయం జరగకుండా చూస్తామని, ప్రస్తుతం అనర్హులుగా గుర్తించిన వారి జాబితాను మళ్లీ పునః పరిశీలన చేసి అర్హుల పెన్షన్లు పునరుద్ధరిస్తామని హామీ ఇచ్చారు. లబ్ధిదారుల సంఖ్యను తగ్గించుకునే ప్రయత్నాలు విరమించుకోవాలని నాయకులు కోరారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎన్‌వై నాయుడు, జిల్లా కమిటీ సభ్యులు రెడ్డి వేణు, బివి రమణ, గొర్లి వెంకటరమణ కొల్లి సాంబమూర్తి, పి.రాజశేఖర్, నాయకులు కరణం రవీంద్ర ,రెడ్డి ఈశ్వరరావు, బంకురు సూరిబాబు, ఆర్ రాము తదితరులు పాల్గొన్నారు.

సిపిఎం ఆధ్వర్యాన కలెక్టరేట్ ఎదుట ధర్నా



కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న పింఛనర్లు, సిపిఎం నాయకులు

పక్కాగా అక్షరాంధ్ర

ప్రజాశక్తి - పార్వతీపురం

జిల్లాలోని నిరక్షరాస్యులకు అక్షర జ్ఞానం కలిగించి, వారికి ఫైనాన్షియల్, డిజిటల్ లిటరసీపై అవగాహన కల్పించాలని కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ అధికారులను ఆదేశించారు. జిల్లాలో అక్షరాస్యత 57 శాతంగా ఉందని, గిరిజన ప్రాంతాల్లో సుమారు 44 శాతం మాత్రమే ఉందన్నారు. కావున నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. సోమవారం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో పలు అంశాలపై జిల్లా కలెక్టర్ సంబంధిత అధికారులతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ ఏడాది 65,011 మంది నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దేలా లక్ష్యాన్ని ప్రభుత్వం నిర్దేశించిందన్నారు. అందులో భాగంగా వయోజన విద్య కింది సాయంత్రం లేదా రాత్రి వేళల్లో నిరక్షరాస్యులకు ప్రతి రోజు ఒక గంట పాటు అక్షర జ్ఞానం కల్పించాలని ఆదేశించారు. స్థానికంగా ఉండి కనీస విద్యార్హత ఉన్న వారిని ట్యూటర్‌గా నియమించుకొని, వారి ద్వారా విద్యను అందించాలన్నారు. ముందుగా కేంద్రానికి అనువైన ప్రదేశాన్ని గుర్తించాలని, ప్రతి కేంద్రం వద్ద ఫ్లెక్సీ బోర్డును ఏర్పాటు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఇందులో డిఆర్‌డిఎ, మెప్మా, డ్వామా, ఐసిడిఎస్ భాగస్వాములు కావాలని అన్నారు. మండల ప్రత్యేక అధికారులు తప్పనిసరిగా కేంద్రాలను సందర్శించి, వయోజన విద్య తీరుతన్నులను పరిశీలించాలని తెలిపారు. వయోజన విద్యకు వచ్చే ప్రతి ఒక్కరికీ అక్షరాలతో పాటు మొబైల్ వినియోగం, డిజిటల్ లావాదేవీలు, ఆర్థిక లావాదేవీలపై పూర్తిగా అవగాహన రావాలని కలెక్టర్ తేల్చిచెప్పారు. అనంతరం ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) పై సమీక్షించారు. వచ్చిన అర్జీల పరిష్కారంలో నాణ్యతను పాటించనందున పునఃప్రారంభమవుతున్నాయని అన్నారు. ఇకపై ఇటువంటివి పునరావృతం కారాదని అన్నారు. ఇందుకోసం ప్రతి శాఖలో పీజీఆర్ఎస్ కొరకు నియమించబడిన ప్రతినిధి రెండు వారాల పాటు కలక్టరేట్ లో శిక్షణను పొందాలన్నారు. సమావేశంలో డిఆర్ఒ కె.హేమలత, ఎస్డీసీలు పి.ధర్మచంద్రారెడ్డి, ఎస్.దిలీప్ చక్రవర్తి, డిఆర్‌డిఎ, డ్వామా, ఐసిడిఎస్ పీడీలు

PUBLIC NOTICE CALLING FOR OBJECTIONS

SCHEDULE:

All that part and parcel of the RCC Slabbed House an extent of 14*35 is equal to 490 SFT or 1380088 sq.yards or 116.6592 sq. mtrs. covered by survey no.171, Door.No.10-22, situated at Golla Veedhi, BC Colony, Komarada village, Komarada Village Revenue, within the limits of Parvathipuram Manyam Dist, SRO Parvathipuram bounded as follows:

East : Wall in between my house and House of Gowri
South : CC Road
West : Hut of P. Simhachalam
North : Road

Measurements:

East to West : 25 feet or 07.60 mtrs.
North to South : 50 feet or 15.240 mtrs.

Notice is hereby given to the public that Ms. Gorji Navya Sri D/o G. Lakshamana Rao, DOB: 2/11/2016 , a minor, is the owner of a above mentioned property, as per the Deed of Sale bearing Doc No. 3470/2023 registered on 30-06-2023, Gorji Lakshamana Rao (Guardian) residing at Komarada, Parvathipuram is the certified guardian of the minor. Whare as the Guardian G. Lakshamana Rao intend to sell/ transfer the aforesaid property to third parties or whoever and filed permission petition i.e GOP 12/2025 before Honorable Court PDJ, Vizianagaram and pending for adjudication. Any one having any claim, right, title or interest over the aforesaid property or any objection to the aforesaid transaction may lodge their claim in writing with supporting proofs to the undersigned within 7 days from the date of publication of this notice, failing which it shall be deemed that there are no valid claims/ tenable objections whatsoever and our client shall go ahead with the aforesaid transaction.

G.V.S. MANIKANTA PATNAIK
ADVOCATE
FLAT: 302, KKS TOWERS,
SHIVAJI PALEM,
VISAKHAPATNAM-17
PH: 7093511506

మున్సిపల్ డిఇ సరెండర్

ప్రజాశక్తి - పార్వతీపురం

యున్సిపల్ డిఇ బివి ప్రసాద్ ని సరెండర్ చేస్తూ జిల్లా కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు మున్సిపల్ కార్యాలయానికి ఉత్తర్వులు అందాయి. డిఇ ప్రసాద్ గతంలో ఇంఛార్జి కమిషనర్‌గా బాధ్యతలు నిర్వహించారు. ఆ సమయంలో ఆయన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు సక్రమంగా అమలు చేయలేదనే కారణంతో సరెండర్ చేసినట్లు తెలుస్తోంది. పట్టణంలో 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.69లక్షలతో పనులు ప్రతిపాదించినప్పుడు తనను గాని, పట్టణ టిడిపి నాయకులను గాని ఎందుకు సంప్రదించలేదని మంత్రి సంధ్యారాణి డిఇ ప్రసాద్ పై ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలిసింది. గత మున్సిపల్ సమావేశంలో 15వ ఆర్థిక సంఘం నిధులతో ప్రతిపాదించిన అభివృద్ధి పనులను కౌన్సిల్‌లో ఆమోదించారు. అంతేకాండా మున్సిపాలిటీలో పి4 అమలుకు సంబంధించి వార్డు సచివాలయం కార్యదర్శులకు మౌఖిక ఆదేశాలు జారీ చేసి మార్గదర్శుల ఎంపిక చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు.సచివాలయం సిబ్బంది కూడా మార్గదర్శులుగా ముగ్గురు చొప్పున బంగారు కుటుంబాలు దత్తత తీసుకునేలా మౌఖిక ఆదేశాలు ఇవ్వాలని ఇంఛార్జి కమిషనర్‌ను కలెక్టర్ ఆదేశించారు. అయితే ఆయన లిఖిత పూర్వక ఆదేశాలు జారీ చేయడంతో సచివాలయం సిబ్బందిలో ఆందోళన వ్యక్తమైంది. ఈ కారణాలను సాకుగా చూపి కలెక్టర్ డిఇ ప్రసాద్ ని సరెండర్ చేస్తూ ఉత్తర్వులు జారీచేశారు. అయితే తెరవెనుక బలమైన కారణాలు వున్నాయనే వాదనలు వినిపిస్తున్నాయి. శ్యామలాంబ పండగ సమయంలో మంత్రి సంధ్యారాణి తీసుకొచ్చిన రూ.2 కోట్ల నిధుల వినియోగంలో జరిగిన జాప్యానికి వైసిపి పాలకవర్గమే కారణమంటూ ఆమె పలు సందర్భాల్లో విమర్శించారు. పాలకవర్గం కౌన్సిల్‌లో ఆమోదం తెలిపలేదని, అందుకే పనులు జరగలేదని ఆమె ఆరోపించారు. అయితే ఇటీవల జరిగిన మున్సిపల్ సమావేశ లో వైసిపి కౌన్సిలర్లు మంత్రి వ్యాఖ్యలను తప్పు పట్టారు. మంత్రి అబద్దాల ప్రచారం మానుకోవాలని హితవు పలికారు.దీనికి కమిషనర్‌గా ఉన్న డిఇ ప్రసాద్ కూడా వైసిపి కౌన్సిలర్ల వాదనతో ఏకీభవించారు. ఇది కూడా మంత్రి ఆగ్రహానికి కారణం కావచ్చు ననే ప్రచారం జరుగుతోంది. సౌమ్యుడైన డిఇ తనకు ఇంఛార్జి కమిషనర్ బాధ్యత లు వద్దని చెప్పినా వినకుండా ఆయనకే కట్టబెట్టి బలిపశువును చేశారనే ప్రచారం సాగుతోంది.

వర్షపు నీటిని గెడ్డకు మళ్లించండి : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

పట్టణంలో లోతట్టు ప్రాంతాల్లో నిల్వ ఉంటున్న వర్షపు నీటిని వరహాలగెడ్డకు మళ్లించేందుకు ప్రణాళికలు సిద్ధం చేసే దిశగా అధికారులు చర్యలు చేపట్టాలని స్థానిక ఎమ్మెల్యే బోనెల విజయ్ చంద్ర సంబంధిత అధికారులతో అన్నారు. గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాల కారణంగా పట్టణంలో గల సౌందర్య థియేటర్ వెనుక శ్రుతుల్లి రియల్ ఎస్టేట్ కాలనీలు ముంపునకు గురయ్యాయనే విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే సోమవారం పరిశీలించారు. వర్షపు నీరు నిల్వకు గల కారణాలను సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. కాలనీలో గల కాలువలకు అడ్డంగా విద్యుత్ స్తంభాలు, విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఉండడాన్ని గమనించారు. వెంటనే ఆ విద్యుత్ స్తంభాలను తొలగించి వేరే ప్రాంతంలో ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఈ ప్రాంతంలో తక్షణమే కాలువల్లోని పూడికలు తీయించాలని మున్సిపల్ కమిషనర్ జి.శ్రీనివాసరాజును సూచించారు. పట్టణంలో పాత కాలువలు, కొత్త కాలువలకు కనెక్టింగ్ లేకపోవడం వల్ల నీరు నిల్వ ఉంటుందని అన్నారు. ప్రధాన రహదారిలో వున్న కాలువలపై కట్టడాలు జరిగినాయని, వీటిని తొలగించి నిల్వ ఉంటున్న వర్షపు నీటిని వరహాలగెడ్డకు పోయే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. ఇక మీదట పార్వతీపురంలో ఏ ప్రాంతంలో కూడా వర్షపు నీరు నిల్వ లేకుండా చర్యలు తీసుకుంటామన్నారు. ఎమ్మెల్యేతో పాటు కౌన్సిలర్స్, మున్సిపల్, విద్యుత్ శాఖ అధికారులు, పాల్గొన్నారు.

యుద్ధ ప్రాతిపదికన రహదారుల మరమ్మతులు చేపట్టండి

పార్వతీపురం పట్టణ పరిధిలో పెద్ద పెద్ద గోతులతో ఏర్పడిన రహదారులకు యుద్ధ ప్రాతిపదికన మరమ్మత్తు పనులు చేపట్టాలని స్థానిక ఎమ్మెల్యే విజయ్ చంద్ర ఆర్ అండ్ బి అధికారులకు ఆదేశించారు. సోమవారం సాయంత్రం జిల్లా కేంద్రంలో భారీ వాహనాల రాకపోకలతో, వరద ప్రభావంతో పాడైన పట్టణ శివారులో ఉన్న రాయగడ రోడ్డు, బైపాస్ రోడ్డు, పాత బస్టాండ్ రోడ్డులను ఆయన ఆర్ అండ్ బి అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆర్ అండ్ బి అధికారులతో మాట్లాడుతూ, యుద్ధ ప్రాతిపదికన మరమ్మతులు చేయాలని, ప్రజలకు, వాహనాల రాకపోకలకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా వెంటనే చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్ అండ్ బి అధికారులు, టిడిపి నాయకులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు గొడుగు పట్టిన కమిషనర్


ఎమ్మెల్యే కు గొడుగు పట్టిన కమిషనర్ శ్రీనివాసరాజు

స్థానిక ఎమ్మెల్యే బోనెల విజయచంద్రకు మున్సిపల్ ఇన్‌ఛార్జి కమిషనర్ శ్రీనివాసరాజు సోమవారం గొడుగు పట్టారు. తుఫాన్ కారణంగా భారీ వర్షాలు పడుతుండడంతో ఎమ్మెల్యే మున్సిపల్, విద్యుత్ అధికారులతో కలిసి పట్టణంలోని లోతట్టు ప్రాంతాలను పరిశీలించారు. వర్షం పడుతున్న సమయంలో కమిషనర్ శ్రీనివాసరాజు ఎమ్మెల్యే బోనెలకు గొడుగు పడుతూ కనిపించారు. గతంలో పని చేసిన ఇంఛార్జి కమిషనర్ వెంకటేశ్వర్లు ఎమ్మెల్యే అడుగులకు మడుగులొత్తేలా వ్యవహరించడమే కాకుండా సహచర ఉద్యోగులపై ఆధిపత్యం చలాయించేవారు. వారిని వేధింపులకు గురి చేశారు. అది భరించలేక ఉద్యోగులు కలెక్టర్ శ్యాం ప్రసాద్‌కు ఫిర్యాదు చేయడంతో అప్పటి కమిషనర్ వెంకటేశ్వర్లు కథ కంచికి చేరింది. ఇప్పుడున్న కమిషనర్ శ్రీనివాసరాజు కూడా అదే బాటలో పయనిస్తున్నారనే వాదనలు వినిపిస్తున్నాయి.

రోడ్ల పనులకు అధిక ప్రాధాన్యత : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - కురుపాం

కూటమి ప్రభుత్వంలో గిరిజన ప్రాంతాల్లో రహదారి, మౌలిక వసతులకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నట్లు ప్రభుత్వ విప్, స్థానిక ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి అన్నారు. మండలంలోని ఉదయపురం నుంచి కలిగొట్టు గ్రామానికి రూ.కోటి 30 లక్షలతో 3.5 కిలోమీటర్ల బిటి రోడ్డు పునర్నిర్మాణానికి మంజూరైన రోడ్డుకు కొబ్బరికాయ కొట్టి పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గిరిజన ప్రాంతాల అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తున్నారన్నారు. ప్రతి గిరిజన గ్రామానికి రోడ్డు, విద్య, వైద్యం, తాగునీరందించాలనే లక్ష్యంతో పనిచేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి చైర్‌పర్సన్ కడ్రక కళావతి, వైస్ చైర్మెన్ జి.గొరేశంకర్, జనసేన నియోజకవర్గ సమన్వయకర్త కడ్రక మల్లేశ్వరరావు, మండల టిడిపి అధ్యక్షుడు కెవి కొండయ్య, కూటమి నాయకులు, కార్యకర్తలు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

మద్యం దుకాణాల్లో పర్మిట్ రూములు

ప్రజాశక్తి - కురుపాం

మద్యం దుకాణాలు నిర్వహించే లైసెన్స్ దారులు పర్మిట్ రూములను ఏర్పాటు చేయాలని కురుపాం ఎక్సైజ్ సిఐ పి.శ్రీనివాసరావు అన్నారు. సోమవారం ఆయన మాట్లాడుతూ ఎ4 మద్యం దుకాణాలు నిర్వహించే లైసెన్సుదారులందరూ పర్మిట్ రూమ్ లైసెన్స్ ఫీజును ఆయా లైసెన్స్ ఫీజు స్లాబ్‌ల ప్రకారం చెల్లించి ఎ4-బి లైసెన్స్‌ను పొంది గవర్నమెంట్ ఆర్డర్ ప్రకారం మద్యం సేవించే వినియోగదారులకు పర్మిట్ రూములను తక్షణం అందుబాటులోనికి తీసుకొనిరావాలని, అన్ని మద్యం షాపులలో అన్ని రకాల మద్యం బ్రాండ్లు అందుబాటులో ఉంచి ఎంఆర్‌పి ధరలకు మద్యం విక్రయించాలని ఆదేశించామన్నారు. నిబంధనలు ఉల్లంఘించిన మద్యం దుకాణాలపై నిబంధన ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఎంఇఒలకు సెల్ఫ్ డ్రాయింగ్ పవర్ కల్పించండి

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

రాష్ట్ర వ్యాప్తంగా విద్యా శాఖలో పనిచేస్తున్న ఎంఇఒ-1లకు సెల్ఫ్ డ్రాయింగ్ పవర్స్ కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని కోరుతూ విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ కోన శశిధర్‌కు లేఖ ద్వారా ప్రాతినిధ్యం చేసినట్లు ఎంఇఒ-1 అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు ఎస్.సింహాచలం సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంఇఒ1లకు సెల్ఫ్ డ్రాయింగ్ పవర్స్ లేనందువల్ల చాలా ఇబ్బందులు పడుతున్నట్లు తెలిపారు. మండల పరిషత్‌లో వివిధ శాఖలకు మండల స్థాయి అధికారులు పనిచేస్తున్నారని, వారెవ్వరికీ కూడా ఎంపిడిఒ, డిడిఒగా లేరని, విద్యాశాఖలో పని చేస్తున్న ఎంఇఒ1లకు మాత్రం ఎంపిడిఒలను డిడిఒలుగా ఉంచడం సరికాదన్నారు. మండలంలో 150 నుండి 200 మంది టీచర్లకు డ్రాయింగ్ ఆఫీసర్‌గా, పరిపాలన అధికారిగా పనిచేస్తూ గెజిటెడ్ ఆఫీసర్స్‌గా ఉన్న ఎంఇఒ1లకు సెల్ఫ్ డ్రాయింగ్ పవర్సు కల్పించకపోవడం తమకు ఆత్మగౌరవ సమస్యగా మారిందన్నారు. ఈ విషయంలో తమకు న్యాయం చేయాలని కోరుతూ విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీకి ప్రాతినిధ్యం చేశామని రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సామల సింహాచలం, రవి నాయక్‌బుక్యా తెలిపారు.

గెడ్డలుప్పి పిఎసిఎస్ అధ్యక్షులుగా సింహాచలం

ప్రజాశక్తి - సీతానగరం

మండలంలోని గెడ్డలుప్పి ప్రాథమిక సహకార పరపతి సంఘ అధ్యక్షులుగా సొంగల సింహాచలం సోమవారం ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు అందుబాటులో ఉండి రైతు సమస్యలను పరిష్కరించే దిశగా కృషి చేస్తానని అన్నారు. బ్యాంక్ అభివృద్ధికి పాటు పడతామన్నారు. ఆయనతోపాటు డైరెక్టర్‌గా భోగి అప్పలనాయుడు, శంకర్రావు ప్రమాణ స్వీకారం చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు కర్రీ శంకర్రావు టిడిపి నాయకులు పాల్గొని అభినందలు తెలిపారు.

ప్రజాశక్తి విలేకరికి పుష్పశ్రీవాణి పరామర్శ

ప్రజాశక్తి - కురుపాం

స్థానిక ప్రజాశక్తి విలేకరి జి.ఢిల్లీశ్వరరావు భార్య కాలికి ఇటీవల గాయమైన విషయం తెలుసుకున్న మాజీ డిప్యూటీ సిఎం పాముల పుష్ప శ్రీవాణి సోమవారం కురుపాంలో గల తన ఇంటి వద్దకు వెళ్లి పరామర్శించి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ఆమె వెంట ఎంపిపి శెట్టి పద్మావతి, జెడ్‌పిటిసి జి.సుజాత, మండల కో ఆప్షన్ సభ్యులు షేక్ జిలానీ, వైసిపి జిల్లా అధికార ప్రతినిధి శెట్టి నాగేశ్వరరావు, రాష్ట్ర వైసిపి మైనార్టీ సంయుక్త కార్యదర్శి షేక్ నూరుల్లా, మేజర్ పంచాయతీ ఉప సర్పంచ్ షేక్ ఆదిల్, నాయకులు ఆకుల శ్రీధర, శ్రీను, చంటి తదితరులు పాల్గొన్నారు.


నాగేశ్వరరావు యోగక్షేమాలు అడిగితెలుసుకుంటున్న ఎమ్మెల్యే జయకృష్ణ

నాగేశ్వరరావుకు ఎమ్మెల్యే పరామర్శ

ప్రజాశక్తి - వీరఘట్టం

మండలంలోని బొడ్లపాడు గ్రామానికి చెందిన టిడిపి సీనియర్ నాయకులు పొన్నాడ నాగేశ్వరరావును స్థానిక ఎమ్మెల్యే నిమ్మకజయకృష్ణ సోమవారం పరామర్శించారు. నాగేశ్వరరావు గత కొంతకాలం నుండి అనారోగ్యానికి గురయ్యారని విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే బొడ్లపాడు గ్రామానికి వెళ్లి ఆయన్ని కలిశారు. ఈయనతోపాటు కూటమి నాయకులు ఉదయాన ఉదయభాస్కర్, బల్ల హరిబాబు, తాండ్రోతు సత్యం నాయుడు, తదితరులు ఉన్నారు.

పాసు పుస్తకాలు పంపిణీకి చర్యలు

ప్రజాశక్తి - కొమరాడ

రీసర్వే పూర్తయిన రైతులకు ప్రభుత్వ రాజముద్రతో పట్టాదారు పాస్ పుస్తకాలు అందించేందుకు చర్యలు చేపట్టిందని తహశీల్దార్ సిహెచ్ సత్యనారాయణ తెలిపారు. సోమవారం తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. మండలంలోని 31 గ్రామపంచాయతీల్లో 26 గ్రామాల్లో రీసర్వే పూర్తయిందన్నారు. రీ సర్వే పూర్తయిన నేపథ్యంలో రైతులకు ప్రభుత్వం రాజముద్రతో కలిగిన పట్టాదారు పాసు పుస్తకాలను అందజేస్తుందని తెలిపారు. మండలంలోని 5640 రైతులకు పంపిణీ చేసేందుకు రాజముద్రతో ప్రభుత్వం కొత్త పట్టాదారు పాసు పుస్తకాలు తమ కార్యాలయాలకు పంపిందని చెప్పారు. ప్రభుత్వం ఆదేశాలు అనంతరం ఈ పట్టాదారు పాస్ పుస్తకాలను రైతులకు నేరుగా అందజేస్తామన్నారు. ఇక నుంచి కొత్తగా భూముల మ్యుటేషన్, రీ సర్వే పూర్తయిన రైతులకు నేరుగా పోస్టల్ ద్వారా రైతు ఇంటి వద్దకే పాసు పుస్తకాలు పంపిస్తామన్నారు.

వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి - సీతానగరం

వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో గ్రామాల్లో వ్యాధులు ప్రబలకుండా సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని, ప్రజలు తగు జాగ్రత్తలు పాటించాలని జిల్లా ఎన్‌సిడి ప్రోగ్రాం అధికారి డాక్టర్ టి.జగన్‌మోహనరావు సూచించారు. మండలంలోని బూర్జలో సోమవారం వైద్య సిబ్బందితో కలిసి సందర్శించారు. గ్రామంలో ఎక్కడైనా సీజనల్ వ్యాధులు, జ్వరాలు నమోదవుతున్నాయా, అందుతున్న వైద్య సేవలపై గ్రామస్తులను అడిగి తెలుసుకున్నారు. తాగు నీటిని పరిశీలించి, నీటి నాణ్యతా పరీక్షల నివేదికలపై వైద్య సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. సంచార చికిత్స వైద్య శిబిరంపై ముందు రోజున గ్రామంలో తెలియజేయాలన్నారు. దోమల లార్వా ప్రదేశాలను గుర్తించి ఎప్పటికప్పుడు నివారణా చర్యలు చేపట్టాలన్నారు. తాగు నీటి ట్యాంక్ పరిశుభ్రతపై తెలుసుకుని అక్కడ పరిసరాలను పరిశీలించారు. వర్షాలు కురుస్తున్నందున వ్యాధులు ప్రబలకుండా ప్రజలు తగు జాగ్రత్తలు, సూచనలు పాటించాలన్నారు. కాచి చల్లార్చిన నీటినే తాగాలన్నారు. ఆహారంపై మూతలు ఉండేలా చూసుకోవాలని, సాధ్యమైనంత వరకు వేడిగా ఉండే ఆహారం తీసుకోవాలని, చేతులు పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ ఉండడానికి ఆస్కారం ఉన్న పాడైన వస్తువులు, వ్యర్థాలను తొలగించాలని తద్వారా దోమల వ్యాప్తి తగ్గుతుందని అన్నారు. సీజనల్ వ్యాధుల నిర్ధారణ, చికిత్సకు అవసరమైన మందులు, పరీక్షలు గ్రామీణ ఆరోగ్య కేంద్రంలో సిద్ధంగా ఉండేలా చూసుకోవాలని వైద్య సిబ్బందిని ఆదేశించారు. ప్రచార మాధ్యమాలు, గృహ సందర్శనల ద్వారా సీజనల్ వ్యాధులపై ప్రజలను ఎప్పటికప్పుడు అప్రమత్తం చేయాల న్నారు. అనంతరం గ్రామంలో దీర్ఘకాలిక వ్యాధుల పర్యవేక్షణ, స్కూల్ హెల్త్ స్క్రీనింగ్‌పై వైద్య సిబ్బందిని ఆరా తీశారు. కార్యక్రమంలో సర్పంచ్ గజ్జల. దాసు, సిహెచ్ఒ గాయత్రి, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎన్‌సిడిపిఒ

జ్వరాల బారిన పడకుండా జాగ్రత్తలు

పార్వతీపురం టౌన్: వర్షాలు కురుస్తున్న దృష్ట్యా జ్వరాల బారిన పడకుండా ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలని బందలుప్పి పిహెచ్‌సి డాక్టర్ శ్రీకాంత్ అన్నారు. మండలంలోని వెంకటరాయడుపేట గ్రామంలో డాక్టర్ శ్రీకాంత్ ఆధ్వర్యంలో సోమవారం 104 వైద్య శిబిరం నిర్వహించారు. దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారికి గర్భిణులకు, బాలింతలకు, వృద్ధులకు పరీక్షలు చేసి వారికి కావలసిన మందులు అందజేశారు. వర్షం పడడం వల్ల జ్వరాలు ప్రబలే అవకాశముండడంతో రక్త నమూనాలు సేకరించి పరీక్షలు కూడా నిర్వహించాలన్నారు. రోగుల తనిఖీలను ఆన్‌లైన్‌లో పొందుపరచాలని, దీర్ఘకాలిక వ్యాధుల చికిత్సలు కూడా నెలవారీ సక్రమంగా 104 వాహనాల్లో జరగాలని, అధిక రక్తపోటు మధుమేహం తదితర మందులు రోగులకు సక్రమంగా పూర్తిస్థాయిలో అందాలన్నారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది, 104 సిబ్బంది పాల్గొన్నారు.


పార్వతీపురం: వైద్య తనిఖీలు చేస్తున్న డాక్టర్ శ్రీకాంత్

హైకోర్టును తప్పుదోవ పట్టించిన ప్రభుత్వం

సాలూరు: ఇటీవల ఎసిబి వలలో చిక్కిన గిరిజన సంక్షేమ శాఖ చీఫ్ ఇంజనీర్ శ్రీనివాస్‌పై దాఖలైన కేసులో టిడిపి కూటమి ప్రభుత్వ సాక్ష్యాత్తు రాష్ట్ర ఉన్నత న్యాయ స్థానాన్నే తప్పుదోవ పట్టించిందని ఎస్టీ ఉద్యోగుల సంఘం న్యాయ సలహాదారు రేగు మహేష్, ఆదివాసీ వికాస పరిషత్ నాయకులు చెల్లూరు జోగయ్య విమర్శించారు. సోమవారం వారు విలేకరులతో మాట్లాడారు. ఇటీవల రూ.25 లక్షలు లంచం తీసుకుంటూ ఎసిబి అధికారులకు గిరిజన సంక్షేమ శాఖ చీఫ్ శ్రీనివాస్ చిక్కడం కన్నా రాష్ట్ర ప్రభుత్వ స్థాయిలో పెద్ద కథ నడిచిందని చెప్పారు. అవినీతిపరుడైన చీఫ్ ఇంజనీర్‌ను కొంత మంది ప్రభుత్వ పెద్దలు వెనకేసుకొస్తున్నారని, అక్కడితో ఆగకుండా ఏకంగా హైకోర్టునే బురిడీ కొట్టించారని చెప్పారు. విశాఖ పట్నానికి చెందిన ద్విబాషి శేషగిరిరావు అనే వ్యక్తి ప్రజా వాజ్యం కింద 2024లో హైకోర్టులో రిట్ పిటిషన్ వేశారని, అది డిసెంబర్‌లో విచారణకు వచ్చిందన్నారు. అయితే చీఫ్ ఇంజనీర్‌పై విజిలెన్స్ అధికారులు దర్యాప్తు చేస్తున్నారని, కోర్టు జోక్యం అవసరం లేదని ప్రభుత్వ న్యాయవాది హైకోర్టుకు చెప్పారని తెలిపారు. ఆ కేసును కొట్టివేయాలని ప్రభుత్వ న్యాయవాది కోరడంతో కోర్టులో శేషగిరిరావు వేసిన ప్రజా వాజ్యాన్ని డిస్మిస్ చేసిందని చెప్పారు. ఇప్పటికే చీఫ్ ఇంజనీర్ శ్రీనివాస్‌పై విజిలెన్స్ దర్యాప్తు జరుగుతున్నందున ప్రత్యేక కేసు అవసరం లేదని ప్రభుత్వ న్యాయవాది వాదించారని తెలిపారు. హైకోర్టు ఆ వాదనను వాస్తమని నమ్మి కేసును కొట్టివేసిందని అన్నారు. కూటమి ప్రభుత్వ పెద్దలు కోర్టును తప్పుదోవ పట్టించారని విమర్శించారు. దీంతో ఆదివాసీ వికాస పరిషత్ తరపున చెల్లూరు జోగయ్య, తదితరులు 2025 ఫిబ్రవరిలో రాష్ట్ర ప్రభుత్వానికి శ్రీనివాస్‌పై ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. అదేవిధంగా అప్పటి విజిలెన్స్ కమిషనర్ వీణా ఈష్ చీఫ్ ఇంజనీర్ శ్రీనివాస్‌కు వ్యతిరేకంగా ప్రభుత్వానికి చెప్పారని, ఆయనకు ప్రభుత్వంలో రాజకీయ పలుకుబడి కారణంగా చర్యలు తీసుకోలేదని చెప్పారు. గత ప్రభుత్వ హయాంలో అవినీతి ఆరోపణలు ఎదుర్కొన్న చీఫ్ ఇంజనీంపై టిడిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కూడా అదే స్థానంలో నిలబెట్టడానికి కారణం కొంతమంది పెద్దల అండదండలేనని రేగు మహేష్, జోగయ్య ఆరోపించారు.

మృతి చెందిన కార్మిక కుటుంబాలకు ఉద్యోగం ఇవ్వాలి

◆ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిూస్ ఫెడరేషన్ డిమాండ్ ◆మృతుల ఫొటోలతో కలెక్టరేట్ వద్ద ధర్నా

ప్రజాశక్తి - పార్వతీపురంటౌన్

మున్సిపల్ ఆప్కాస్ విధానంలో పారిశుధ్య కార్మికులుగా పనిచేస్తూ అకస్మాత్తుగా మృతి చెందిన కార్మికుల కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని, ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిూస్ ఫెడరేషన్, సిఐటియు నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం సిఐటియు ఆధ్వర్యంలో కలెక్టర్ కార్యాలయం వద్ద మృతి చెందిన కార్మికుల ఫొటోలతో వారి కుటుంబ సభ్యులు, యూనియన్, సిఐటియు నాయకులు ధర్నా చేపట్టారు. అనంతరం కలెక్టర్‌కు వినతిపత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కార్యదర్శి ఎన్‌వై నాయుడు మాట్లాడుతూ ఈ సమస్య రెండేళ్లుగా ఉందని, ఇప్పటికే జిఒ 25 ప్రకారంగా రాష్ట్ర వ్యాప్త అన్ని మున్సిపాల్టీల్లో కార్మిక కుటుంబ సభ్యులకు ఉద్యోగాలు కల్పించారని, అందులో భాగంగా జిల్లాలోని పాలకొండ, సాలూరు ప్రాంతాల్లో ఉద్యోగ కల్పన జరిగిందని, కానీ పార్వతీపురం మున్సిపాలిటీలో జీవో అమలుకు నోచుకోలేదని అన్నారు. ఇది కేవలం కుట్రలో భాగంగా భావించాల్సి వస్తుందని విమర్శించారు. జీవో 25ను పటిష్టంగా అమలు చేసి కార్మిక కుటుంబాలకు ఉద్యోగం ఇవ్వాలని, రాత్రి వేళల్లో విధులు నిర్వహిస్తున్న పారిశుధ్య కార్మికులకు ఎలాంటి రక్షణ లేదని రాత్రి వేళల్లో కాకుండా పగలు విధులు నిర్వహించేలా మార్పు చేయాలని డిమాండ్ చేశారు. యోగాంధ్ర కార్యక్రమంలో పనిచేసిన కార్మికులకు టిఎ, డిఎలు ఇవ్వాలని, మున్సిపల్ వాహనాలు నడుపుతున్న సీనియర్ వర్కర్లను డ్రైవర్లుగా గుర్తించాలని, మున్సిపల్ వర్కర్లకు అధికారుల వేధింపులు లేకుండా చూడాలని, ఈ సమస్యలు పరిష్కరించకపోతే భవిష్యత్తు పోరాటాలకు కార్యక్రమం చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా కోశాధికారి గొర్లి వెంకటరమణ, జిల్లా కార్యదర్శి బి.వి.రమణ, పట్టణ కార్యదర్శి బి.సూరిబాబు, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు సిహెచ్ సింహాచలం, ఎస్.శంకర్రావు, బి.బాలు, టి.భానుప్రసాద్, కె.రాంబాబు, ఎస్.వినయ్ కుమార్, జె.లక్ష్మి, ఎం.మహేంద్ర, బి.నాగమణి మరియు తదితరులు పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న కార్మికులు, నాయకులు

ఆధార్ నమోదు కేంద్రాలను పున:ప్రారంభించాలి

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

జిల్లా కేంద్రంలో పట్టణ పరిధిలో ఉన్న వార్డు సచివాలయాలలో ఆధార్ నమోదు కేంద్రాలను పునః ప్రారంభించాలని పట్టణ పౌర సంక్షేమ సంఘం కార్యదర్శి పాకల సన్యాసిరావు జిల్లా రెవెన్యూ అధికారి కె.హేమలతను కోరారు. జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో సోమవారం జరిగిన గ్రీవెన్సులో వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలోని 9,10 మున్సిపల్ వార్డులకు చెందిన 5వ వార్డు సచివాల యంలోని, 1,2 మున్సిపల్ వార్డులకు చెందిన 1వ వార్డు సచివాలయంలోని గతంలో ఆధార్ నమోదు కేంద్రాలను నిర్వహించేవారని సుమారు 16 నెలలుగా ఆ రెండు ఆధార్ కేంద్రాలలో సేవలు అందజేయకపోవడంతో పట్టణ ప్రజలు ఎంతో ఇబ్బందులు పడుతూ, బెలగాం రైల్ గేట్ అవతల గల 15,16 వార్డులకు చెందిన 8వ వార్డు సచివాల యంలో గల ఆధార్ కేంద్రానికి వెళ్లాల్సి వస్తుందని చెప్పారు. ప్రస్తుతం ఆ ఆధార్ నమోదు కేంద్రంలో కూడా సేవలు నిలిచిపోయాయని, దీని కారణంగా7 సంవత్సరాల వయసు దాటిన పిల్లల బయోమెట్రిక్స్ నమోదు చేయకపోవడం వల్ల చాలా మంది పిల్లల ఆధార్ కార్డులు రద్దు అవుతున్నాయని చెప్పారు.

పెండింగ్ జీతాలు ఇవ్వాలి

పార్వతీపురం: ఐటిడిఎ పరిధిలో పనిచేస్తున్న సిఆర్‌టిలకు పెండింగ్ జీతాలు తక్షణమే ఇవ్వాలని పలువురు గిరిజన సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం పార్వతీ పురం మన్యం జిల్లా కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు. మూడు నెలలుగా జీతాలు లేకపోతే కాంట్రాక్టు ఉపాధ్యా యుల కుటుంబాలు ఎలా బతకాలని ప్రశ్నించారు. నెల్లిమర్ల గిరిజన ఆశ్రమ పాఠశాలలో జరిగిన నాడు -నేడు పనుల బిల్లుల చెల్లింపులపై సమగ్ర విచారణ జరిపించాలని కలెక్టర్ కు కోరారు. అలాగే పార్వతీపురం ఐటిడిఎ కార్యాలయంలో ఎఇగా పిలవబడే జి.తిరుపతి రావుకు ఆఫీస్ లో పనిలేదని, పోస్ట్ కూడా మంజూరు చేయలేదని, గత పిఒ విష్ణు చరణ్ జీతాలు అపారని, ఇప్పుడు ఏ రకంగా చెల్లింపులు చేస్తున్నారో విచారణ జరపాలని కలెక్టర్‌ను కోరారు. ఈ విషయంలో ఐటిడిఎ అధికా రులు కోర్టుకు వాస్తవాలు చెప్పలేదనే అనుమానం వ్యక్తం చేశారు. ఆ డబ్బుతో గిరిజన గర్భిణుల వసతి గృహం సిబ్బందికి జీతాలు ఇవ్వొచ్చని అన్నారు. కార్యక్రమంలో ఆదివాసీ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు మువ్వల అమర్నాథ్, గిరిజన సంక్షేమ సంఘం ఉత్తరాంధ్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పాలక రంజిత్ కుమార్, తాడంగి సాయిబాబు, ట్రైబల్ రైట్స్ ఫోరమ్ జిల్లా అధ్యక్షులు ఇంటి కొప్పల రామకష్ణ, గిరిజన విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షులు పల్ల సురేష్, గిరిజన అభ్యుదయ సంఘం జిల్లా అధ్యక్షులు ఆరిక చంద్ర శేఖర్, గిరిజన మహిళా నాయకురాలు, కోలక గౌరమ్మ, మన్యం గిరిజన సేవా సంఘం నాయకులు మంచాల ఈశ్వర్రావు తదితరులు పాల్గొన్నారు.


పార్వతీపురం: ఆర్‌డిఒకు సమస్యను వివరిస్తున్న పాకల సన్యాసిరావు

మొండెంఖల్‌ను మండలంగా ఏర్పాటు చేయాలని కలెక్టర్‌కు వినతి

కురుపాం: మొండెంఖల్‌ను మండలంగా ఏర్పాటు చేయాలని ట్రైబల్ రైట్స్ ఫోరం రాష్ట్ర జిల్లా అధ్యక్షులు రొబ్బ లోవరాజు, ఐ.రామకృష్ణ సోమవారం గ్రీవెన్స్‌లో కలెక్టర్ శ్యాంప్రసాద్‌కు వినతిపత్రం అందించారు. అనంతరం వారు మాట్లాడుతూ ఇటీవల కాలంలో రాష్ట్ర ప్రభుత్వం కొత్త జిల్లాలు, మండలాల ఏర్పాటు సరిహద్దులు మార్చడం కోసం నోటిఫికేషన్ ఇచ్చిందన్నారు. కురుపాం మండలం తూర్పు ముఠా ప్రాంతానికి చెందిన ఆదివాసీలు మండల కేంద్రానికి రావాలంటే సుమారుగా 50 నుంచి 60 కిలోమీటర్లు దూరం ప్రయాణించాల్సి వస్తుందన్నారు. తూర్పు ముఠా ప్రాంతంలో 11 గ్రామపంచాయతీలు 15,000 పైగా జనాభా కలిగి ఉన్నారని, మెండెంఖల్ గతంలో తాలూకాగా ఉండేదని ఈ ప్రాంతంలో పివిటిజిలు ఎక్కువగా నివసిస్తున్నారని అన్నారు. కొత్తగా మండలం ఏర్పాటు చేసినట్లయితే పరిపాలన పరంగా అందరికీ అందుబాటులో ఉంటుందని తెలియజేస్తూ వినతి అందించామన్నారు. కార్యక్రమంలో ఆదివాసీ జాయింట్ యాక్షన్ కమిటీ జిల్లా అసిస్టెంట్ సెక్రెటరీ దుక్క సీతారం, గిరిజన విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షులు పల్లా సురేష్,గిరిజన అభ్యుదయ సంఘం జిల్లా అధ్యక్షులు ఆరిక చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

చంద్రబోస్ ఆశయ సాధనకు కృషి

ప్రజాశక్తి - కొమరాడ

నేతాజీ సుభాష్ చంద్రబోస్ ఆశయ సాధన, మన హక్కులను కాపాడుకునే దిశగా యువతీయువకులు ముందుకు రావాలని సిపిఎం పార్టీ జిల్లా కమిటీ సభ్యుడు కొల్లి సాంబమూర్తి పిలుపునిచ్చారు. సోమవారం మండల కేంద్రంలో నేతాజీ సుభాష్ చంద్రబోస్ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలతో నివాళులర్పించారు. అనంతరం సాంబమూర్తి మాట్లాడుతూ దేశ స్వతంత్ర సంగ్రామంలో కీలక పాత్ర పోషించిన వ్యక్తి ఎవరంటే సుభాష్ చంద్రబోస్ అని గర్వంగా చెప్పవచ్చు అని చెప్పారు. ఈయన 1897 జనవరి 23వ తేదీన జన్మించి 1945 ఆగస్టు 18వ తేదీన విమాన ప్రమాదంలో మరణించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో యువత పాల్గొన్నారు.

పాచిపెంట: సుభాష్ చంద్రబోస్ వర్ధంతి సభ పాచిపెంట పాత బస్టాండ్ ఆవరణలో నిర్వహించారు. ముందుగా రాజ్యాంగ పరిరక్షణ వేదిక నాయకులు అబ్దుల్ నజీర్ భాష సుభాష్ చంద్రబోస్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సిఐటియు నాయకులు కోరాడ ఈశ్వరరావు మాట్లాడుతూ సుభాష్ చంద్రబోస్ ఆశయ సాధన కోసం యువతి యువకులతో పాటు ప్రజలంతా కదలి రావాలని పిలుపునిచ్చారు. దేశ స్వాతంత్ర పోరాటంలో ఎంతో కీలక పాత్ర పోషించిన సుభాష్ చంద్రబోస్ దేశం గర్వించదగిన గొప్ప నాయకుడని కొనియాడారు. ఈ కార్యక్రమంలో స్థానికులు ఉప్పల వెంకట్రావు, డివైఎఫ్ఐ నాయకులు పి.మహేష్, ఆర్.సతీష్, ప్రజాసంఘాల నాయకులు జలుమూరి గిరి, పి. శ్రీనివాసరావు పాల్గొన్నారు.


పాచిపెంట: నినాదాలు చేస్తున్న సిఐటియు నాయకులు


కొమరాడ: నివాళులర్పిస్తున్న సాంబమూర్తి

26 వరకు మద్యం బార్ షాపులకు దరఖాస్తుల ఆహ్వానం

◆28న కలెక్టరేట్‌లో డ్రా
◆జిల్లాలో 28 మద్యం బార్ షాపులు ఏర్పాటు
◆పార్వతీపురంలో 8 షాపులకు దరఖాస్తులు
◆కల్లుగీత కార్మికులకు విజయనగరంలో మూడు, పార్వతీ పురంలో 2 కేటాయింపు
◆ఎక్సైజ్‌శాఖ డిప్యూటీ కమిషనర్ శ్రీనివాస చౌదరి

ప్రజాశక్తి- కంటోన్మెంట్

విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాలో నూతన మద్యం బార్ షాపులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రొహిబిషన్ అండ్ ఆబ్కారీ శాఖ డిప్యూటీ కమిషనర్ వై శ్రీనివాస్ చౌదరి తెలిపారు. సోమవారం డిప్యూటీ కమిషనర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నూతన బార్ పాలసీ 2025-28 సంబంధించి గెజిట్ నోటిఫికేషన్ సోమవారం విడుదల అయ్యిందన్నారు. విజయనగరం జిల్లాలో 28, పార్వతీపురం మన్యం జిల్లాలో 8మద్యం బార్ షాపులకు ఈనెల 26 వరకు ఆన్‌లైన్ లేదా నేరుగా విజయనగరం, పార్వతీపురం కలెక్టరేట్లో ఉండే సూపరింటెంట్ కార్యాలయంలో దరఖాస్తులను అందించాలన్నారు. విజయనగరం పట్టణంలో 18, బార్ షాపులు రాజాం 5, భోగాపురం విఎంఆర్‌డిఎ పరిధిలో ఒకటి బొబ్బిలిలో 4బార్ షాపులు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. విజయనగరం జిల్లాలో కల్లుగీత కార్మికులకు విజయనగరం, నెల్లిమర్ల రాజాంలో మూడు బార్ షాపులు, పార్వతీపురం జిల్లాలో పార్వతీపురం పాలకొండ కేటాయించినట్లు తెలిపారు. పార్వతీపురం జిల్లాలో 8 బార్ షాపులు ఏర్పాటు చేసినట్లు తెలిపారు పార్వతీపురం 4, సాలూరులో 4 కేటాయించామన్నారు. కల్లుగీత కార్మికులకు రెండు బార్ షాపులను కేటాయించారన్నారు.

5 లక్షల రూపాయలు దరఖాస్తు ఫీజు

బార్ షాపులకు దరఖాస్తు చేసినందుకు ఐదు లక్షల రూపాయలు ఫీజు, రూ.10వేలు రిజిస్ట్రేషన్ ఫీజు చెల్లించాలన్నారు. ఒక్కో బార్ షాప్‌నకు నాలుగు దరఖాస్తుల పైబడి వస్తేనే డ్రా తీస్తామన్నారు. నాలుగు కంటే తక్కువ దరఖాస్తులు వస్తే మరల దరఖాస్తులకు సమయాన్ని పెంచే అవకాశముందన్నారు. సమావేశంలో ఎక్సైజ్‌శాఖ సూపరింటెంట్ బి శ్రీనాదుడు పాల్గొన్నారు


లాటరీ ద్వారా బార్లకు రిజర్వేషన్ కేటాయిస్తున్న అధికారులు

విజయనగరం మద్యం బార్ షాపు యాత కులానికి కేటాయించాలి

విజయనగర జిల్లా కేంద్రంలో మద్యం బార్ షాపును యాతకులానికి కాకుండా శ్రీశైన కులానికి బార్ షాపు కేటాయించడం పట్ల యాత కులస్తులు సంఘ నాయకులు కోరారు. గత వైన్ షాపుల్లో కూడా విజయనగరం జిల్లా కేంద్రంలో యాతలు ఎక్కువగా నివాసం ఉన్నప్పటికీ వైన్ షాపులను శెట్టిబలిజలకు కేటాయించారని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం, జిల్లా అధికారులు స్పందించి యాతకులస్తులు ఎక్కువ నివాసం ఉండే విజయనగరంలో యాత కులానికి మద్యం బార్ షాపును కేటాయించాలని కోరారు.